క్లుప్తంగా

మొహర్రంను శాంతియుతంగా జరుపుకోవాలి



చనుగొండ్లలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పవన్‌కుమార్

గూడూరు రూరల్: మొహర్రం పండగలో ఎలాంటి గొడవలకు పాల్పడకుండా శాంతియుతంగా ప్రజలు జరుపుకోవాలని ఎస్‌ఐ పవన్‌కుమార్ సూచించారు. చనుగొండ్లలో పీస్ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న జరిగే మొహర్రం పండగ వేడుకలను ప్రజలందరూ ఐక్యమత్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఉత్సవం జరిగే సమయంలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్ వంటివి రోడ్లపై పోసి అంటించరాదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్, సర్పంచు వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్పీకే అమ్మకాలు జరపాలి



సి.బెళగల్‌లోని దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నిర్ణీత ఎంఆర్పీకే అమ్మకాలు చేయాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్ కుమార్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని విత్తన, పురుగు, ఎరువు మందుల దుకాణంలో తనిఖీలు చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలు, మందులనే రైతులు ఇవ్వాలని, నిషేధిత మందులు, విత్తనాలు అమ్మినట్లైయితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మందుల కొనుగోలు దారులకు తప్పనిసరిగా రశీద్‌లను ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా సజ్జా, కంది, గోరుచిక్కుడు విత్తన నమూనాలను తీసుకుని పరీక్షల నిమిత్తం విజయవాడ ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు ఏఓ తెలిపారు.


కొండ అక్రమాలపై చర్యలు తీసుకోండి

సి.బెళగల్: మండలంలోని ప్రభుత్వ భూములు, కొండలను ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సి.బెళగల్, గొల్లలదొడ్డి, క్రిష్ణదొడ్డి గ్రామస్తులు తహసీల్దార్ శేషఫణిని కోరారు. మండలంలోని సి.బెళగల్, గొల్లలదొడ్డి, క్రిష్ణదొడ్డి గ్రామస్తులు సి.బెళగల్‌కు చెందిన ముక్కల గట్టు, గొల్లలదొడ్డి, క్రిష్ణదొడ్డి కొండలలో అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారని, కొండలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలతో తమ గొర్రెల పెంపకాలకు ఆటంకంగా మారిందన్నారు. అధికారులు సత్వరమే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. అదేవిధంగా స్థానిక పోలీస్ స్టేషన్ చేరుకున్న ప్రజలు ఎస్‌ఐ పీరయ్యకు సమస్యను తెలియజేసి ప్రభుత్వ భూములను రక్షించాలని కోరారు.

రైల్వే బ్రిడ్జికి అండర్ డ్రైనేజీ సిస్టమ్‌కు గ్రీన్ సిగ్నల్

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ గ్రామం ముందు ఉన్న రైల్వే బ్రిడ్జి కింద డ్రైనేజీ, వర్షపు నీరు ప్రవాహం వలన కొన్నేళ్లుగా గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో డబుల్ లేన్ పనులు ప్రారంభమై గ్రామం వద్ద కొనసాగుతుండటంతో గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గురువారం సికింద్రాబాద్‌లో జీఎం(జనరల్ మెనేజర్)అరుణ్‌కు మార్‌జైన్‌ను కలిశారు. ఫొటోలు చూపించి సమస్యను వివరించారు. వర్షాకాలంలో బ్రిడ్జి కింద ప్రవాహం 3-4అడుగులు మేర ప్రవహిస్తుందని, దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని జీఎంకు తెలిపారు. డబుల్ లేన్ పనుల్లో భాగంగా అండర్ పాస్ డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ మేరకు అండర్ డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటుకు జీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పాఠశాలలకు సెమిస్టర్- 2 పుస్తకాలు



ఎండీయూ వాహనాల ద్వారా సెమిస్టర్-2 పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ-2

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు రూరల్ పరిధిలోని 91 ప్రభుత్వ పాఠశాలలకు సెమిస్టర్ 2 పుస్తకాలను ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేసినట్లు కర్నూలు రూరల్-2 ఎంఈఓ కె వినోద్ కుమార్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 10వ తరగతులకు సంబంధించి సెమిస్టర్ -2 పుస్తకాలను ప్రతి ప్రభుత్వ పాఠశాలకు చేరవేస్తున్నామని అన్నారు. ఈ నెల 22వ తేదీన సెమిస్టర్-2 పుస్తకాలతో విద్యార్థులంతా ఫోటోలు దిగి అప్‌లోడ్ చేయాలని ఆయా పాఠశాలల హెడ్‌మాస్టర్లు, సీఆర్‌పీలను, సిబ్బందిని ఆదేశించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా 'సురక్ష'

- 70 ఏళ్ల చరిత్రలో ఏ ప్రభుత్వం ఇలాంటి పాలన అందించలేదు
- సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధాకర్



ముడుమలగుర్తిలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ముడుమలగుర్తి, కల్లపరి గ్రామాల్లో ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ జయన్న ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాలలు నిర్వహించి 1698 మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గతంలో ఏ సర్టిఫికెట్ పొందాలన్న ప్రజలు రోజుల తరబడి సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా గ్రామాల్లోనే అందజేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లకు పైగా నిధులను ఖర్చు చేసిందన్నారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ముడుమలగుర్తికి రోడ్డు నిర్మాణం, గోరంట్ల-కొత్తపల్లె బ్రిడ్జి నిర్మాణం, వర్కూరు వద్ద తుమ్మలవాగుపై వంతెన నిర్మాణం, కోడుమూరు ఆర్‌టీసీ బస్టాండ్ అభివృద్ధి లాంటి ఎన్నో పనులను తమ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు.

పవన్‌కల్యాణ్‌వి పనికిమాలిన మాటలు

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వలంటీర్ వ్యవస్థను తప్పు పడుతూ పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే సుధాకర్ విమర్శించారు. వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు ఇకనైనా మానుకోవాలని లేకపోతే భవిష్యత్‌లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 14 ఏళ్లు సీఎంగా ప్రజలకు ఏమి చేయలేని చంద్రబాబు ప్రస్తుతం ఎన్నికలు దగ్గర పడుతుండడంతో అది చేస్తాం, ఇది చేస్తామంటూ మాయమాటలు చెబుతున్నారని ప్రజలు నమ్మవద్దన్నారు. సుపరిపాలనను అందిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ బాలకృష్ణ, ఉప సర్పంచ్ గోకారి, ఎంపీటీసీ లతాదేవి, నాయకులు ఇమ్మానేయులు, మల్లేష్, మధు, గోకారి, అయ్యస్వామి, సంజన్న, కల్లపరి నరసింహారెడ్డి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

చనుగొండ్లలో..

గూడూరు రూరల్: మండలంలోని చనుగొండ్ల గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సురక్ష కార్యక్రమం లక్ష్యం, ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ సునీత, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, కో ఆప్షన్ సభ్యుడు దౌల, గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్.వెంకటేశ్వర్లు, మహేశ్వరరెడ్డి, మాధవస్వామి, నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లోనే సర్టిఫికెట్లు మంజూరు చేశారు



గతంలో ఏ సర్టిఫికెట్ పొందాలన్నా పనులు మానుకుని రోజుల తరబడి మండల కేంద్రానికి వెళ్లి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయంలోనే ధ్రువీకరణ పత్రాలు, వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పథకాలు చేరుతుండడం సంతోషంగా ఉంది. సురక్ష ద్వారా ఆదాయ, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు పైసా ఖర్చు లేకుండా రెండు రోజుల్లోనే అందుకోవడం సంతోషంగా ఉంది.

– రాజశేఖర్ గౌడ్, కృష్ణాపురం గ్రామం, కోడుమూరు మండలం

ఇబ్బందులు తప్పాయి



మా ఊరు కల్లపరి గ్రామం మండల కేంద్రానికి 10 కి.మీ దూరంలో ఉంది. పెద్దగా రవాణా సౌకర్యాలు లేవు. ఏవైనా సర్టిఫికెట్లు కావాల్సి వస్తే రోజుల తరబడి ఆయా ప్రభుత్వ ఆఫీసుల చుట్టు తిరుగుతూ ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదన్న ఉద్దేశంతో సురక్ష ద్వారా అర్జీలు పెట్టిన రెండు రోజుల్లోనే ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తుండడం ఆనందాన్నిచ్చింది.

– మహేశ్వరమ్మ, కల్లపరి గ్రామం, కోడుమూరు మండలం

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్పీటీసీ సద్దల సరళమ్మ



ఉయ్యాలవాడలో ధ్రువ పత్రాలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పాణ్యం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ సేవలు ప్రజల చెంతకే చేర్చారని జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి అన్నారు. గురువారం కొండజుటూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో ఏదైన సంక్షేమ పథకాలు పొందాలంటే నాయకులు, కార్యాలయాల చూట్టు తిరగాల్సివచ్చేందన్నారు. అయినా ఎన్నికల సమయంలోనే పథకాలు అందించే వారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ప్రజలకు ప్రభుత్వ సేవలు స్వగ్రామంలోనే సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఎవరి ప్రమేయం లేకుండా ఇంటి వద్దే అందిస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ భాస్కర్‌రావు, ఎంఈఓ కోటయ్య, ఏపీఓ విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

గడివేముల: దళారుల ప్రమేయం లేకుండా పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తూ, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని దుర్వేశి సర్పంచ్ మండల మమత అన్నారు. గురువారం మండల పరిధిలోని దుర్వేశి గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 280 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఏఓ హేమసుందర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, రమేష్, ఈఓపీఆర్డీ అబ్దుల్ ఖాలీక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలోనే ఉచితంగా ధ్రువపత్రాలు

ఓర్వకల్లు: ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలను గ్రామ స్థాయిలోనే ఉచితంగా పంపిణీ చేయాలనే సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉయ్యాలవాడ, కన్నమడకల గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడలో జరిగిన కార్యక్రమానికి ప్రభాకర్‌రెడ్డితో పాటు, ఎంపీపీ తిప్పన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఉయ్యాలవాడలో 1,246, కన్నమడకలలో 693 చొప్పున మొత్తం 1939 ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమాలలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, సర్పంచులు బి.శకుంతులమ్మ, తిక్కలి పెద్ద కాశిమన్న, ఎంపీటీసీ సభ్యులు సరోజమ్మ, సోమశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

కల్లూరు: అర్హులై ఉండి పథకాలు రానివారిని గుర్తించి పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారని కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 29వ వార్డు శరీన్‌నగర్‌లో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించి లబ్ధిదారులు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ గోపాల కృష్ణ, స్పెషల్ ఆఫీసర్ క్రిష్టఫర్, నాయకులు తిరుమలేష్ గౌడ్, హుస్సేన్ ఆలం, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ కాంతులు



చనుగొండ్లలో ప్రజా సమస్యలను తెలుసుకుటున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు. చనుగొండ్లలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదల సంక్షేమం, అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేశారని వివరించారు. కుల, మతాలు, వర్గాలు, రాజకీయాలు చూడకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఎంపీపీ సునీత, సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ మాధవీలత, తహసీల్దార్ శివశంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి



మాట్లాడుతున్న స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ పద్మజ

కోడుమూరు రూరల్: సమగ్ర బాల్య అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పిల్లల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయవచ్చని స్త్రీశిశు సంక్షేమ శాఖ కర్నూలు రీజనల్ జాయింట్ డైరెక్టర్ పద్మజ సూచించారు. గురువారం కోడుమూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కేర్ అండ్ గ్రో శిక్షణా కార్యక్రమానికి ఆర్‌జేడీ పద్మజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల్లో శారీరక వికాసం, మానసిక వికాసం చాలా ముఖ్యమైందన్నారు. చిన్నారుల్లో మేధోశక్తి, భావోద్వేగ వికాసం, సామాజిక నైపుణ్యాలను పెంపొందించే వాతావరణాన్ని సృష్టించడం వల్ల ప్రతి చిన్నారి పూర్తిస్థాయి సామర్థ్యాన్ని చేరుకుంటారని అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. రీజనల్ మేనేజర్ రఘురాం, కేర్ అండ్ గ్రో సీఈఓ డాక్టర్ మేఘన కంభం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రాజమ్మ, జరీనా, మాధవిలత, పద్మ, సుజాతమ్మ, మల్లేశ్వరమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బీహార్‌వాసి మృతి

ఓర్వకల్లు: మండలంలోని గుమ్మితం తండా వద్ద జరుగుతున్న పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనుల వద్ద ఓ బీహార్ వాసి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. బీహార్ రాష్ట్రంలోని పశ్చిమ చంపారన్ జిల్లాకు చెందిన బునిలాల్ మెహత కుమారుడు సురేందర్ మెహత(42) క్షి ఏడాది క్రితం సోలార్ ప్రాజెక్టు నిర్మాణ పనులలో వలస కూలీగా వచ్చాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో గుమ్మితం తండా రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా, ఏపీ 21 బీఎం 7456 నెంబర్ గల జేసీబీ బకెట్ సురేందర్ మహెత తలకు తగడంతో తీవ్ర రక్త గాయాలకు గురయ్యాడు. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో కోలుకోలేక గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రాజారెడ్డి గురువారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సురేందర్ మెహత చిన్నాన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృత దేహానికి పోస్టు మార్టం నిర్వహించినట్లు తెలిపారు. మృతునికి భార్యతో పాటు, ఇద్దరు కుమారులు, కమార్తె సంతానం ఉన్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడుతాం



కబ్జాకు గురైన వక్ఫ్‌బోర్డు భూములను పరిశీలిస్తున్న జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్

కర్నూలు (న్యూటౌన్): కబ్జాదారుల చెర నుంచి వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడుతామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్ అన్నారు. గురువారం కర్నూలు మండలం పూడూరు గ్రామంలో కబ్జాదారుల చెరలో ఉన్న వక్ఫ్‌బోర్డు భూములను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పూడూరు గ్రామంలోని సర్వే నంబర్ 21-2లో 14.16 ఎకరాలు, 29లో 22.60, 53లో 14.64, 77/ఏ లో 25.65, 77/బీ 3.56, 129లో 1.80, 162లో 3.12, 224లో 35.60, 193బీలో 5.88 ఎకరాలు మొత్తం 143 ఎకరాల వక్ఫ్‌బోర్డు భూములున్నాయని తెలిపారు. కబ్జాదారులపై వక్ఫ్‌బోర్డు చట్టం పరంగా చర్యలు చేపట్టి, వీటన్నింటినీ వారి చెరనుంచి విడిపించి పూడూరు మసీదు ముతవల్లి చాంద్‌బాషాకు అప్పగిస్తామని చెప్పారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

నేడు స్టాంటన్‌పురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 39వ వార్డు స్టాంటన్‌పురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరవుతారని, నగర పాలక సంస్థ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని ప్రకటనలో కోరారు.

జగనన్న సురక్ష కార్యక్రమం

కర్నూలు మండలం గార్గేయపురంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే 22వ తేదీన కర్నూలు మండలం పడిదెంపాడు, నందనపల్లె గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు.

సి.బెళగల్: మండలం పరిధిలోని రెండు గ్రామాలలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సదస్సులను నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రాముడు తెలిపారు. శుక్రవారం ఉదయం 11:30 గంటలకు మండలంలోని కంబదహాల్ గ్రామంలో తహసీల్దార్ శేషఫణి, ఈఓఆర్డీ సందీప్‌ల ఆధ్వర్యంలో, ఉదయం 12 గంటలకు గొల్లలదొడ్డి గ్రామంలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తుల ఆధ్వర్యంలో సదస్సులను ఉంటాయన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని తెలిపారు.

సైబర్, ఆర్థిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గూడూరు రూరల్: సైబర్ ఆర్థిక నేరాలపై అవగాహన కలిగి ఉండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు తాలూకా సీఎఫ్ఎల్ సంస్థ కౌన్సిలర్ రాముడు నాయక్ హెచ్చరించారు. చనుగొండ్లలో సైబర్ నేరాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్ల చేతిలో పడి అమాయకులు డబ్బును పోగొట్టుకుంటు మోసపోతున్నారన్నారు. వీటిపై ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టామన్నారు.

రోడ్లను బాగుచేయాలి

సి.బెళగల్: మండలంలో దెబ్బతిన్న రోడ్లను వెంటనే బాగు చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మోహన్ ఆధ్వర్యంలో కోడుమూరు అభివృద్ధిపై నిర్వహించిన జీపు జాత మండలంలోని గ్రామాలలో సాగింది. మండల పరిధిలోని కంబదహాల్, పలుకుదొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్‌దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోట గ్రామాలలో కొనసాగిన జీపుజాతాలో ఆయన మాట్లాడుతూ.. నదీతీర గ్రామాలలో రోడ్డను బాగు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వెంకట్, చిన్న అక్బర్, చంద్ర, రాముడు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు గురువారం తెలిపారు. జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని, డ్యాంలో ప్రస్తుతం 0.845 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు వెల్లడించారు.

ప్రశ్నిస్తున్న గొంతులను అణచివేస్తున్న బీజేపీ

కల్లూరు: ప్రశ్నిస్తున్న గొంతులను బీజేపీ ప్రభుత్వం అణచివేస్తోందని కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంటరీ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. గురువారం మన ఊరికి మన గడపకు మన కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా నెరవాడ గ్రామంలో పర్యటించారు. 2024 ఎన్నికల్లో నరేంద్ర మోదీ ప్రభుత్వాని సాగానంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

కళాశాలను సందర్శించిన డీఎస్‌డబ్ల్యూఓ

కోడుమూరు రూరల్: కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ గురువారం సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న హాస్టల్ వసతులపై ప్రిన్సిపాల్ పద్మావతిని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు సొంత భవనం ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

రేపు గోదా దేవి జయంతి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈనెల 22వ తేదీ గోదాదేవి జయంతిని నిర్వహించనున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజుగుప్త తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉదయం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, దర్శనం, విష్ణు సహస్రనామ పారాయణం, సాయంత్రం పల్లకీ సేవ, పవళింపు సేవ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

రోడ్డు నిర్మాణానికి కృషి చేయండి



రవాణా శాఖ మంత్రి విశ్వరూప్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు మండలం రేమట, పూడూరు గ్రామాలకు సంబంధించి రోడ్లు ఏర్పాటు చేయాలని రవాణా శాఖ మంత్రి విశ్వరూప్‌ను కర్నూలు, సి.బెళగల్, గూడూరు జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మౌలాలి కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం విజయవాడలో రవాణా శాఖ మంత్రి విశ్వరూప్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ రేమట, పూడూరు గ్రామాలకు రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆపద సమయంలో ఆసుపత్రికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని చెప్పారు. త్వరలో రేమట, పూడూరు రోడ్డు నిర్మాణం చేపట్టాలని వారు కోరారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

గూడూరు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. కోడుమూరు అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి ఓటర్ల ఇంటింటి సర్వే, ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంపై గురువారం రెవెన్యూ కార్యాలయం ఆవరణలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధంతో సమానమని, ఓటు హక్కు గల వారందరూ ఓటింగ్ లో పాల్గొనాలన్నారు. 2024 జనవరి 1 కి 18 ఏళ్ల వయసు నిండే వారంతా ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలన్నారు. జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటి ఓటర్ల పరిశీలన చేస్తారన్నారు. చని పోయిన వారిని జాబితాలో తొలగించడం, కొత్త వారిని చేర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే లక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. డిసెంబర్ 26 నాటికి అభ్యంతరాలకు పరిష్కారం చూపి, 2024 జనవరి 5 కి ఫైనల్ ఓటరు జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు ఎల్.వెంకటేశ్వర్లు, విజయ్, టీడీపీ నుంచి గజేంద్రగోపాల్, పలు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

తప్పులకు తావులేకుండా జాబితా రూపొందించాలి

కోడుమూరు రూరల్ : తప్పులకు తావులేకుండా ఓటరు జాబితాను రూపొందించాలని కోడుమూరు తహసీల్దార్ జయన్న బీఎల్వోలను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణలపై బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్వోలంతా శుక్రవారం నుంచి ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లు ఉన్నారా లేదా సర్వే చేయాలన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సి.బెళగల్: మండల కేంద్రంలో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. కల్లూరు మండలం ఎ.కొంతలపాడు గ్రామానికి చెందిన ఆంజనేయులు (30), భార్య బుజ్జమ్మ సి.బెళగల్‌లోని జెడ్పీ హైస్కూల్ వెనుక కాలనీలో గుడిసెను అద్దెను తీసుకుని నివాసముంటున్నారు. బుజ్జమ్మ సి.బెళగల్ కస్తూర్బా పాఠశాలలో వంట సహాయకురాలిగా (కుకింగ్ హెల్పర్) పనిచేస్తోంది. ఆంజనేయులు సొంత గ్రామానికి వెళ్లి వ్యవసాయం చేస్తూ తిరిగి వస్తూ ఉండేవాడు. ఆంజనేయులు రెండేళ్లుగా మూడెకరాల సొంత పొలంతో పాటు, మరో ఎకరం కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశాడు. పంట నష్టం రావడంతో దాదాపు రూ.5 లక్షల వరకు అప్పులు పెరిగిపోయాయి. దీంతో విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో తాడుతో ఉరివేసుకున్నాడు. సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన భార్య నిర్జీవంగా వేలాడుతున్న భర్తను చూసి బిగ్గరగా రోధించింది. స్థానికుల సాయంతో మృతదేహాన్ని కిందకు దించారు. గురువారం మృతుడి భార్య నుంచి ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసిన ఎస్‌ఐ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ప్రయాణికులకు సేవలందించండి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికులకు తగిన సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని కర్నూలు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి టి.వెంకటరామం సూచించారు. గురువారం కర్నూలు-2డిపోలో ఉత్తమ ఉద్యోగుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు కోసం ప్రతి డ్రైవర్ యత్నించాలన్నారు. ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా బస్సు నడిపితేనే సురక్షిత ప్రయాణాలు సాధ్యమన్నారు. సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు కండక్టర్లు కృషి చేయాలన్నారు. ప్రయాణికులు చెయ్యి ఎత్తిన ప్రతి చోటా బస్సు ఆపి, వారిని ఎక్కించుకుని, కోరిన చోట దించాలని, అప్పుడే సేవలు మెరుగుపడతాయని చెప్పారు. బస్సు కండీషన్ మెరుగుపర్చడంతో పాటు మైలేజీ అధికంగా వచ్చేలా గ్యారేజీ సిబ్బంది పనిచేయాలన్నారు. బస్సుల నిర్వహణ సక్రమంగా ఉంటే ఫెయిల్యూర్స్ తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీరు రజియా సుల్తానా, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు వెంకటరమణ, కర్నూలు-1, 2 డిపోల మేనేజర్లు సుధారాణి, సర్దార్ హుసేన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులకు సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్

కర్నూలు (న్యూటౌన్): ఒకే రకమైన పంట కాకుండా, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పలు రకాల పంటలు వేయడంతో రైతుకు ఆదాయంతో పాటు నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలో సర్వసతి అనే మహిళ పొలంలో ప్రధాన పంట దేశీ పత్తి (నాన్‌బీటీ)తో పాటు 18 రకాల విత్తనాలకు బీజామృతంతో వేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ రకాల పంటలు వేయడంతో ఒకే పంటలో నష్టం వచ్చినా మరో పంట నుంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులందరికీ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ మల్లికార్జున, ఆంజనేయులు, యూనిట్ ఇన్‌చార్జ్ రమేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.